

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 18 పుష్పం : 54-56 5-9-2001

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 6** **ISSUE : 18**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## నారదుడు - వాల్మీకి

అది అరణ్యం. నారద మహాముని తంబూరా వాయిస్తూ నారాయణ మంత్రం (అష్టాక్షరీ మంత్రం) గానంచేస్తూ బ్రహ్మానందంతో పారవశ్యంగా ముందుకు సాగిపోతున్నారు. అంతట్లో మాటువేసి దాక్కున్న ఒక అడవి మనిషి, వాల్మీకి ఆయనకు ఎదురుపడి, మీదగ్గరఉన్న సొమ్మంతా న్యాయంగా ఇచ్చివేయండి లేకపోతే చంపేస్తాను అన్నాడు. సమయస్ఫూర్తికి మారుపేరైన నారద మహాముని, శాంతితో ఇలా అన్నాడు. "నాయనా! నీపని నీవు మానవద్దు కాని చేసేపని ఎరుకతో చెయ్యి. సంపదకోసం ఇతరులను చంపటంవల్ల నీకు పాపం కలుగుతుంది. నీ కుటుంబ సభ్యులకోసం నీవు ఈ పని చేస్తున్నావు. నీ సుఖంతో నీ కుటుంబసభ్యులు పాలుపంచుకొంటున్నారు. నీవు చేసే పాపాన్నికూడా వాళ్ళు పంచుకొని ఎవరైనా నీబదులు, వాళ్ళ నరకానికి వెళతారేమో అడుగు" అన్నారు. నా కుటుంబసభ్యులు నన్ను అమితంగా ప్రేమిస్తారు, నేను ఏం చెయ్యమంటే

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**


30-07-2001 మహేంద్రవాడ .......... 3
15-08-2001 అప్పనపల్లి .......... 8
19-08-2001 ఆకివీడు .......... 12

అనుచేస్తారు అని వాల్మీకి బదులిచ్చారు. అయితే ఏ కుటుంబసభ్యులు నీ తరపున నరకానికి వెళతారో, అడిగి రమ్మన్నారు. నారదమునీంద్రులు. అట్లే అనిచెప్పి, ఈలోపు నారదుడు పారిపోకుండా చెట్టుకు కట్టివేసి ఇంటికి వెళ్ళాడు వాల్మీకి. ముందు, నేను చేసే పాపకర్మలకు నా బదులు నీవు నరకానికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నావా అని భార్యను అడిగాడు. ఆమెకు అత్తమామలమీద ఒకేసారి ప్రేమపుట్టుకొచ్చి, నేను నరకానికి వెళితే మీ తల్లితండ్రులను ఈ ముసలి వయస్సులో ఎవరు చూస్తారు? అందుచేత నాకు కుదరదు అని ఖండితంగా చెప్పింది. వాల్మీకి తల్లితండ్రులను అడిగాడు, వారేమన్నారంటే, మమ్మల్ని పోషించవలసిన బాధ్యత నీది, హత్యలుచేస్తావో, దొంగతనంచేస్తావో మాకనవసరం. నీవు చేసిన పాపానికి మేము నరకానికి వెళ్ళటం ఏమిటి అని ఎదురు ప్రశ్న వేశారు. పిల్లలుకూడా వారికి తోచిన వంక వారుపెట్టి నరకానికి వెళ్ళటానికి మాకు వీలుపడదని నిష్కర్షగా చెప్పేశారు. అప్పుడు వాల్మీకికి జ్ఞానోదయం అయ్యింది, తాను ఎవరికోసం హత్యలు, దొంగతనాలు చేస్తున్నాడో, వారు తనను వాడుకుంటున్నారు తప్ప, తనను ప్రేమించటం లేదు అని తెలుసుకున్నాడు. ఇటువంటి వారికోసం ఈ ఘోరపాపాలు చెయ్యటం సరైన పనా అని ఆలోచించటం మొదలుపెట్టాడు. మనమూ వాల్మీకిలా, మనవారిమీద రాగముతో ఎన్నో చెయ్యకూడని పనులుచేసి పాపం మూటగట్టుకుంటున్నాము. ఇవి నరకానికి దారితీసే పనులు. వాల్మీకిలాగ మనకు జ్ఞానోదయం కలిగినప్పుడు మాత్రమే ఈ పాపపు పనులు మానేస్తాం.

వాల్మీకి ఇక ఆలస్యం చెయ్యకుండా నారదునివద్దకు తిరిగివెళ్ళి, కట్లువిప్పి, భక్తితో, తనను సంస్కరించే ఉపాయమేమన్నా చెప్పమని ప్రాధేయపడతాడు. అపుడు నారదుడు వాల్మీకికి "రామ" మంత్రం ఉపదేశిస్తాడు. వాల్మీకి, చదువులేని మూలానా ఆ మంత్రాన్ని "మరా" "మరా" అని జపించినప్పటికి, అతని శ్రద్ధకు మెచ్చి పరమేశ్వరుడు వాల్మీకికి మోక్షం ప్రసాదిస్తాడు. అట్లు హంతకుడు, బందిపోటు అయిన వాల్మీకి, మహర్షి అయ్యాడు. రాగి, బంగారం అయ్యింది, జీవుడు మాధవుడైనాడు. ప్రయత్నిస్తే మనకు అది వీలవుతుంది.

- Dr. P.V.S. సూర్యనారాయణ రాజు

# భగవంతుడు మనకు ఇచ్చిన తెలివిని విచారణకు ఉపయోగించుకోవలెను

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 30-7-01, మహేంద్రవాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎన్నోజన్మల కృషిఉంటేగాని భక్తి కలగటం కష్టం. భక్తి లేకపోతే ముక్తిరాదు. ఈ కలియుగంలో భక్తిమార్గం మంచిది. భగవంతుడు మనకు తెలివిని ఇచ్చాడు. ఆ తెలివిని చెడ్డకు ఉపయోగిస్తే పాపం వస్తుంది, మంచికి ఉపయోగిస్తే పుణ్యం వస్తుంది. ఆ తెలివిని ఎలా ఉపయోగించాలో మనం తెలుసుకోవాలి. మన తెలివి మనకు చిత్తశుద్ధిని కలుగజేయాలి. చిత్తశుద్ధి లేకుండా మనకు బ్రహ్మానుభవం కలుగదు. ఇప్పుడు మనం ఆనందంకోసం బయట విషయాలమీద, బంధువులమీద, స్నేహితులమీద, వస్తువులమీద ఆధారపడిఉన్నాము. ఇది బానిసత్వం. బయట విషయాలనుండి వచ్చే ఆనందం నిలబడదు. లోకంమీద, ఇంద్రియవిషయాలమీద ఆధారపడకుండా మనం సుఖంగా, శాంతిగా, ఆనందంగాఉండాలంటే మనం ఆత్మజ్ఞానం సముపార్జించాలి. మహాత్ములు చెప్పిన మాటలను మనం వింటున్నాము, పూజచేస్తున్నాము, జపంచేస్తున్నాముకాని అందరి హృదయాలలో ఉన్నవాడే మనహృదయంలోను ఉన్నాడు, మనహృదయంలోఉన్నవాడే అంతటా ఉన్నాడు అనే అనుభవం మనకు రావటంలేదు. అందరి హృదయాలలో ఎవడైతే పరమాత్మను చూస్తున్నాడో వాడు అజ్ఞానంలోనుండి బయటపడతాడు, ఇంక వాడికి పునర్జన్మలేదు. మనకు ఎంత తెలివిఉన్నా, ధనంఉన్నా ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకపోతే ప్రయోజనంలేదు. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేనివాడికి సంసారం వస్తుంది. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉన్నవాడు సంసారంలోనుండి విడుదల పొందుతాడు. అద్దాన్ని ఎంత శుభ్రంచేస్తే మనమొఖం అంత స్పష్టంగా అద్దంలో గోచరిస్తుంది. అలాగే మన మనస్సును పరిశుద్ధంచేసుకొంటే, పరిశుద్ధమైన మనస్సు సహాయంతో హృదయంలోఉన్న మరణంలేని వస్తువును, జ్ఞానతేజస్సును, పరమాత్మను స్పష్టంగా దర్శించవచ్చు. మన మనస్సు స్వచ్ఛంగాఉండాలంటే, శాంతిగాఉండాలంటే చేసే స్నేహాలవిషయంలో, చదివే పుస్తకాలవిషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి.

గురువు ఎలా లభిస్తాడు అని అడుగుతున్నారు. అనేకజన్మలనుండి భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా నీవు ఏభగవంతుడిని అయితే ఆరాధిస్తున్నావో ఆయనే తన

భక్తుడిపట్ల జాలితో, భక్తుని పరిపక్వతనుబట్టి గురురూపంధరించి భూమిమీదకు వస్తాడు. దేహధారుడు ఒకరూపానికి, నామానికి పరిమితమైఉంటాడుకాబట్టి రూపం, నామంలేని స్థితిని అందుకోలేడు. అందుకే గురువు రూపం ధరించివస్తాడు. గురువుపైకి బోధిస్తూఉంటాడు, లోపల పనిచేస్తూఉంటాడు. ఆయన చెప్పిన మాటలను అర్థంచేసుకొని, తదనుగుణంగా జీవించటానికి మీకు శక్తినిఇస్తూఉంటాడు. నీ హృదయంలోఉన్న నిజమైన గురువును తెలుసుకోవటానికి ఏ విషయాలుఅయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించి నిన్ను హృదయంలో ప్రవేశపెడతాడు, వాడు గురువు. తల్లితండ్రులు బట్టలుఇస్తారు, డబ్బుఇస్తారు కాని గురువు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. గురువు జ్ఞానప్రదాత, గురువుఅంటేఆత్మ, గురువుఅంటేశాంతి, గురువుఅంటే మరణంలేనివస్తువు. నిజమైనగురువు నీ హృదయంలోనే ఉన్నాడు, చైతన్యంగాఉన్నాడు, ఆత్మగాఉన్నాడు. బయటగురువు ఏమిచేస్తాడుఅంటే నీ హృదయంలోఉన్న నిజమైనగురువుదగ్గరకు వెళ్ళేవరకు ప్రతీజన్మలోనూ నీకూడాఉంటాడు, నీకు చాకిరీచేస్తూఉంటాడు, మీరు జీతాలుఇవ్వని పాలేరుతనం అది. మీరు పాలేరుతనం పెట్టుకొంటే ఏరోజు కాఫీఇవ్వకపోతే ఆరోజు, ఏరోజు మీరు సరిగ్గాచూడకపోతే ఆరోజు మానివేస్తాడు. కాని గురువు అలాకాదు. మీదగ్గరనుండి ఏమీ ఆశించకుండా చేసేపాలేరుతనం అది. వాడు అనుగ్రహస్వరూపుడు. ఆయనను మీరు దూషించినా, ఏమిచేసినాకూడా ఆయన మీకు శాంతినేఇస్తాడు, వాడు గురువు.

మిమ్మల్ని మీరు పొగడుకోవటం, ఇతరులను నిందించటం వదిలిపెట్టండి. మిమ్మల్ని మీరు పొగడుకోవటంవలన దేహాభిమానం పెరిగిపోతుంది, అహంకారం పెరిగిపోతుంది. పరనిందవలన వాడిలోఉన్న సుగుణాలు మీకుకనబడవు. చాలామంది వారిలోఉన్న గుణాలు చెప్పకొంటారుగాని ఎదుటివారిలో ఈసుగుణంఉంది అనిచెప్పరు. నీ విరోధులు నిన్ను విమర్శిస్తూ ఉంటారు, నీ స్నేహితులు నిన్ను పొగుడుతూఉంటారు. ఆవిమర్శల గాలిలో, పొగడ్తలగాలిలో కొట్టుకొనిపోవద్దు. నీకు గౌరవంవచ్చినా, అగౌరవంవచ్చినా పరమాత్మభావనను విడిచిపెట్టవద్దు. దేహప్రారబ్దమునుబట్టి మంచి, చెడు, సుఖం, దుఃఖం, లాభం, నష్టం, గౌరవం, అవమానం ఎదురవుతూఉంటాయి. ఏదివస్తే అదిరానియ్యి. ఇవిఅన్నీ ప్రకృతికి సంబంధించిన విషయములు. వీటినిచూసి కంగారుపడి పరమాత్మభావనను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. నీస్వార్థంకోసం ఎవరైనా దుర్మార్గులు ఉపయోగపడుతున్నారు అనుకోండి వారు దుర్మార్గులేఅయినా వారు నీ మనస్సుకు సన్మార్గులుక్రింద కనబడతారు.

ఎక్కడినుండో వస్తున్నాము, దేహం మరణించినతరువాత ఎక్కడికో వెళ్ళిపోతున్నాము అని మనంఅనుకొంటున్నాము. నీవు జీవుడిని అనుకొంటున్నావు, దేహాన్నిఅనుకొంటున్నావు అందువలన ఇలా అనిపిస్తోంది. నీవు ఎవడో నీకు తెలిసినప్పుడు, నీలోపలఉన్న చైతన్యం నీకుతెలిసినప్పడు నీవు ఎక్కడినుండిరావటంలేదు, ఎక్కడికిపోవటంలేదు అని నీకు అనుభవంలోనికివస్తుంది అని రమణస్వామి చెప్పారు. నీవు అజ్ఞానంలోనుండి బయటకువచ్చినప్పుడు, దేహబుద్ధినుండి విడుదలపొందినప్పుడు నీవు ఎక్కడికిపోవటంలేదు, ఎక్కడనుండిరావటంలేదు, నీకు రాకలేదు, పోకలేదు, అంతటా నీవేఉన్నావని నీకుతెలుస్తుంది. ముందు అజ్ఞానంనుండి బయటకురా, నీవు అజ్ఞానంలోనుండి బయటకురాకుండా, మోహంలోనుండి బయటకురాకుండా నాలోపల ఏమీలేదు అనుకొంటే ఎలాగ. ముందు అజ్ఞానంలోనుండి బయటకురా. అప్పడు నీలోపలఉన్న వస్తువుగురించి నీకు తెలుస్తుంది.

నీలో దోషాలుఉంటే, బలహీనతలు ఉంటే నీకు ఆత్మానుభవం కలుగదు. నీలో ఏ దోషాలు ఉన్నాయో గురువుచూస్తూఉంటాడు, వాటిని తొలగించటానికి లోపలనుండి పనిచేస్తూఉంటాడు. ఈ పని ఎవరుచేస్తారు? నీ తండ్రిచేస్తాడా? నీ తల్లిచేస్తుందా? నీ భర్తచేస్తాడా? వీరు ఎవరూ చేయలేనిపనిని గురువుచేస్తూఉంటాడు. నిన్ను ఉన్నతమైన స్థితికి చేర్చటానికి, జ్ఞానశిఖరాలలో నిన్ను కూర్చోబెట్టటానికి గురువు ప్రయత్నంచేస్తూఉంటాడు. చైతన్యం నీహృదయంలో ఎంత లోతులలోఉందో అక్కడకు చేర్చేవరకు నీకు ముందునిలబడి మార్గంచూపిస్తాడు, గమ్యానికి చేరేవరకు నీ చెయ్యిపట్టుకొని తీసుకొని వెళతాడు, ప్రయాణంలోవచ్చే అడ్డంకులు తొలగిస్తాడు, వాడుగురువు, గురువుదృష్టిలో అందరూసమానమే. గురువుగురించి బాగాచెపుతున్నారు. నా గురువు ఎవరో నేను ఎలాతెలుసుకోవాలి అని అడుగుతున్నారు. నీవు తదేక ధ్యానం చేయటం వలన, జపం చేయటం వలన నీ గురువు ఎవరో నీకు తెలుస్తుంది. ధ్యానంలో నీ గురువు ఎవరో నీకు స్ఫురిస్తుంది. నీకు అంతర్‌దృష్టి కలిగిందిఅనుకో లోపలనుండి నీ గురువు ఎవరో నీకు తెలుస్తుంది. నీ హృదయంలోఉన్న నిజమే నీగురువు. బాహ్యగురువు నిన్ను అక్కడికి తీసుకొనివెళతాడు. నీహృదయంలోఉన్న నిజమే గురురూపంలో వస్తుందికాబట్టి, ఆయన సమక్షంలో కొండమీదనుండి నీరు ఎలా ఉరకలువేస్తూ ప్రవహిస్తుందో అలాగ ఆయన సన్నిధిలో శాంతి, కాంతి, ఆనందం ప్రవహిస్తూఉంటుంది. ఆయన మాటలు చెప్పనక్కరలేదు. అక్కడ మాటలతోపనిలేదు, ఆయన సమక్షమే సరిపోతుంది, ఆయన ఉనికే సరిపోతుంది. ఆత్మానుభవం పొందటానికి నీకు

అజ్ఞానముఅనే తెర అడ్డువస్తోంది. దానిని తొలగించుకోవటానికి నీవు ప్రయత్నంచేస్తున్నా దానికి నీ సాధన సరిపోదు, నీతెలివి సరిపోదు, గురువుకృపలేకుండా దానిని నీవు తొలగించుకోలేవు. నీకు లోపలనుండి ధైర్యంఇస్తూ, ఆత్మానుభవం పొందటానికి ఏదైతే నీకు అడ్డువస్తోందో ఆ తెరను కత్తిరించేవాడే గురువు. గురువుఅంటే పెద్దసర్జన్. గురువుకృపలేకుండా జననమరణచక్రంనుండి నీవు బయటకురాలేవు. గురువుయొక్క కృప ఇలాఉంటుంది అనితెలుసుకోవటానికి ఏవైనా గుర్తులుచెప్పగలరా కొన్నిమాటలు చెప్పగలరా అనిఅడుగుతున్నాడు. అది మాటలకుఅందదు, తలంపులకుఅందదు, ఊహలకుఅందదు, చేతలకుఅందదు. అది అనుభవైకవేద్యం, అది నీ అనుభవానికి అందుతుంది. గురువుయొక్క కృపవలన ఆత్మజ్ఞానం కలుగుతుంది అనిచెపుతున్నారుకదా దానిని కొద్దిగా వివరించమని అడుగుతున్నాడు. ఏనుగుకు కలలో కనిపించిన సింహంవంటిది గురుకృప. స్వప్నసింహం ఏనుగుకు ఎలా మెలుకువ తీసుకొనివస్తుందో, అలాగ గురువుయొక్క కృప నిన్ను అజ్ఞానంనుండి విడుదలచేసి నీకు జ్ఞానోదయం కలుగజేస్తుంది. అది విషయజ్ఞానంకాదు, నీవు ఎవరిగాఉన్నావో దానిని పట్టిఇచ్చే జ్ఞానం గురుకృపవలన నీకు కలుగుతుంది. మనలను పక్వానికి తీసుకొనిరావటానికి ఎన్నో ప్రక్రియలు అక్కరలేదు. గడ్డిమేటు ఎంతపెద్దదిఅయినా దానిని కాల్చటానికి ఒక్క అగ్గిపుల్లచాలు. అదేవిధంగా మనలో ఎంత అజ్ఞానంఉన్నా గురువుయొక్క దయాపూరితమైన ఒక్కవీక్షణం శోకినవెంటనే అజ్ఞానంనుండి మేల్కొని జ్ఞానోదయం కలుగుతుంది. మన బుద్దిలో దోషంఉంటే ఎదుటివారిలో మంచిఉన్నా మనకు కనబడదు. బుద్ధిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. దేహంఅనే కారుకు బుద్ధి డ్రైవర్‌వంటిది. మన బుద్ధిని జాగ్రత్తగా కాపాడుకోకపోతే ఈ శరీరం అనే కారు ఎక్కడో ఒకచోట ప్రమాదానికి గురిఅవుతుంది. దేహంకంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములకంటే మనస్సు గొప్పది, మనస్సుకంటే బుద్దిగొప్పది, బుద్దికంటే చైతన్యంగొప్పది అని భగవంతుడు చెప్పాడు. అందువలన ఏదైతే ఉన్నతమైనదో, ఉత్తమమైనదో దానిని పొందుఅని భగవంతుడు చెపుతున్నాడు.

మీలో ఒకపొరపాటు నేనుఉంది. మీరు ఎంతసాధనచేసినా, ఎన్నితపస్సులుచేసినా, ఎన్నియోగాభ్యాసాలుచేసినా అందులోనుండి విడుదలపొందకపోతే ఏమీ ప్రయోజనంలేదు, అంతాసున్నా. నీ సాధనయొక్కలక్ష్యం ఆ పొరపాటునేనునుండి విడుదలపొందాలి. రోగం తగ్గటానికి మీరు మందులు వేసుకొంటారు. మందులువాడినా రోగం తగ్గకపోతే ఆ మందులవలన ప్రయోజనంలేదు. అలాగే మీరు ఎన్నిసాధనలు చేసినా పొరపాటునేనునుండి

విడుదలపొందకపోతే ఆ సాధనలవలన ప్రయోజనంలేదు. పొరపాటునేనులోనుండి విడుదలపొందకపోతే హృదయంలోఉన్న నిజమైననేను నీకుగోచరంకాదు. గురుకృపలేకుండా పొరపాటు నేనులోనుండి నీవు విడుదలపొందలేవు. నీవు చేయవలసింది ఏమిటిఅంటే దైనందినజీవితంలో పొరపాటునేనుకువెళ్ళే ఆహారాన్ని కట్‌చెయ్యాలి. ఏ పనిచేసినా ఆందోళనగా, కృత్రిమంగాచెయ్యవద్దు. నిర్మలంగా, నిశ్చలంగా పనిచెయ్యండి, హృదయపూర్వకంగా మాట్లాడండి. నీవు అశాంతిగాపనిచేస్తే, గొప్పలకోసంపనిచేస్తే పొరపాటు నేను ఆరోజుకారోజు పెరిగిపోతుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి. కొంతమందికి పనేదేవుడు, అలా పనిచేస్తూనేఉంటారు, వారికి భోగంఅక్కరలేదు. ఇటువంటివారు పెద్దసాధనలతో పనిలేకుండానే తరిస్తారు. నీ హృదయంలోఉన్న చైతన్యాన్ని గోచరింపచేసేదే నిజమైనతెలివి, మిగిలినదిఅంతాపాడుతెలివి.

జీవితంలోఅన్నీ తలంపులే. మరణంఒకతలంపు, పుట్టుకఒకతలంపు, నీఉద్రేకంఒకతలంపు, కామంఒకతలంపు, నీదేహంఒకతలంపు అన్నీ తలంపులే. ఈ తలంపులా సత్యానుభవంపొందటానికి నీకు సహకరించేది? గాఢనిద్రలో వీటిఅన్నింటిలోనుండి నీవువిడిపోతున్నావు. నీకు ఎన్నితలంపులు వచ్చినా అవి మంచివిఅయినా, చెడ్డవిఅయినా ఈ తలంపులు ఏమీనిజంకాదు. ఈ నిజంకాని తలంపులు నిన్ను నిజందగ్గరకు ఎలా తీసుకొనివెళతాయి. విషయచింతనవద్దు, దైవచింతన పెంచుకో, దైవచింతనలేకుండా భగవదనుభవం నీకుకలుగదు. నీకు నిజంగా భగవదనుభవం కావాలంటే నిరంతరం భగవంతునియందు భక్తికలిగిఉండు. ద్వైతం అద్వైతానికి దారిచూపిస్తుంది. నీ భక్తిపక్వానికి వచ్చినప్పుడు ఈశ్వరుడే నీలోపల చైత్యనంగా దర్శనం ఇస్తాడు. దానికి మిమ్మలను ప్రిపేర్ చేయటంకోసం తన సహజలక్షణాలైన ఆనందంతో, శక్తితో, జ్ఞానంతో ఈశ్వరుడే గురురూపం దాల్చివస్తాడు. గురువును ఏ కోణంలోనుండిచూసినా శాంతే, ఆనందమే ప్రవహిస్తూ ఉంటుంది. ఆయన నీతో మాట్లాడుతున్నట్లు నటిస్తాడు. మీరుబాగున్నారా, భోజనంచేసారా, మీరుఏమిచేస్తున్నారు, మీకుడబ్బుఎంతఉంది, అప్పలుఏమైనాఉన్నాయా అని ఇలా మాట్లాడుతూఉంటాడు, మీతో సన్నిహితంగా ఉండటానికి ఇలా మాట్లాడతాడు. ఇలా మాట్లాడుతూ మీకు తెలియకుండానే మీ హృదయంలోనికి మిమ్మల్ని నెట్టేస్తాడు. గురువు మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళ్తున్నాడు అనుకొంటున్నారు? మీ హృదయంలోఉన్న ఈశ్వరుడిదగ్గరికి తీసుకొనిపోతున్నాడు అందువలన గురువుకూడా ఈశ్వరుడితో సమానము.

# బ్రహ్మభావన ఉన్నవాడిని అలౌకికసుఖం వరిస్తుంది

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 15-8-01, అప్పనపల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సృష్టికిఅంతా ఏవస్తువుఅయితే ఆధారంగాఉందో, ఏది ఉండటంవలన ఈ ప్రపంచంఅంతా నీకు తెలియబడుతోందో, ఏవస్తువు అనుభవంలోనికి రావటంవలన నీవు పునర్జన్మలేనిస్థితిని పొందుతావో ఆ వస్తువును ఉన్నదిఉన్నట్లుగా గ్రహింపచేసేదే జ్ఞానం.. మిగతాది అంతా అజ్ఞానం. ఉన్నవస్తువును ఉన్నట్లుగా గ్రహించటానికి వివేకం ఉండాలి, వైరాగ్యంఉండాలి, అభ్యాసంఉండాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. మనం నిజంకానిదానిని నిజం అనుకొంటున్నాము ఇదే మాయ. నా మాయను జయించటంకష్టం అని భగవంతుడు చెప్పాడు. కావేరినది పుట్టుచోటున ఆదిలో నది సన్నంగా ఉంటుంది. అక్కడ మేకలుకూడా నదిని తేలికగా దాటివెళ్ళిపోతాయి. దానినే మేకదాటు అంటారు. నీకు ఈశ్వరుని పాదాలయందు చలనంలేని భక్తికుదిరితే, ఈశ్వరునియందు సజీవమైనవిశాసంఉంటే కావేరీనదినిఆదిలో మేకలు ఎంత తేలికగా దాటివెళ్ళిపోతున్నాయో అంతతేలికగా నీవు మాయను దాటి తరించవచ్చు, ఈశ్వరునిపొందవచ్చు. ఇదంతా భక్తివలన జరుగుతుంది. భక్తిఅనేది పులివంటిది. పులిదగ్గరకు మేకలు, చిన్నచిన్న జంతువులు రావు. అలాగే భక్తిఅనే పులిదగ్గరకు విషయచింతనరాదు. ఈశ్వరునిపాదాలను ఆశ్రయించటం వలన నీకు తెలియకుండానే నీమనస్సు, ఇంద్రియాలు స్వాధీనంలోనికి వస్తాయి. అది భక్తియొక్క ప్రయోజనం. భగవంతునిమీద సజీవమైన విశ్వాసం కలిగిఉండటంవలన, ఆ భక్తిభావనవలన అన్నీవస్తాయి, మోక్షంకూడా వస్తుంది. భక్తిఅంటే సామాన్యంకాదు, భక్తిజ్ఞానమాత అని భగవాన్ చెప్పారు. భక్తిలేకుండా జ్ఞానంరాదు. నీకు ఈజన్మలో ఆత్మానుభవం కలిగిందిఅంటే పూర్వజన్మలలో ఎంతోకొంత భక్తిని అభ్యసించిఉంటావు. ఈశ్వరుడు ఎంత సర్వజ్ఞుడో, ఎంతశక్తివంతుడో తెలుసుకొని నమస్కారంపెడితే దానికి విలువ ఉంటుంది. నమ్రత పెంచటంకోసమే నమస్కారం. నమ్రతను, సహనమును, వినయమును నెమ్మదిగా పెంచుకొంటూరావాలి. మనకు సహనంలేకపోవటంవలన, నమ్రతలేకపోవటంవలన, ఒకరిపట్ల ఒకరికి ప్రేమభావం లేకపోవటంవలన మనం అశాంతిగాఉన్నాము, సమాజం అంతా అశాంతే. మనిషి సంఘజీవి.

ఒక మనిషి మరొక మనిషితో సంబంధంలేకుండా సమాజంలో జీవించటం కష్టం. సమాజంపట్ల మనకు ప్రేమభావం లేకపోవటంవలన అసలు సమాజానికి మనం ఏమిచేయాలో మనకు తెలియటంలేదు. సమాజంపట్ల మనం నిర్వర్తించవలసిన పాత్రఉంది. మన ఇంట్లోపని మనం ఎలాచేసుకొంటున్నామో అలాగ సమాజంపట్ల మనం నిర్వర్తించవలసిన పాత్రను నిర్వర్తిస్తే శాంతి కలుగుతుంది. మామటుకుమేము బాగుపడిపోతున్నాము, ఇతరులగొడవ మాకు అవసరంలేదుఅంటే వారు మిమ్మల్ని బాగుపడనివ్వరు, ఎప్పుడోవచ్చి మీమీద పడతారు. మనకు పదిరూపాయలు ఉంటే ఇష్టంతో ఒక్కరూపాయి సమాజంకోసం ఖర్చుపెట్టలేనిస్థితిలో అందరూ ఉంటే చివరకు ఈ పది రూపాయలు కూడా సమాజం తీసుకొనే రోజులు వస్తాయి. సమాజిక బాధ్యతలను నిర్వర్తించటంవలనకూడా మనకు పుణ్యబలం వస్తుంది, వివేకం పెరుగుతుంది. మనం మంచి నేర్చుకొంటే మంచిగా మాట్లాడగలం. మనం మంచిచెప్పాలి, ఎవరైనా పెద్దలు మంచిచెపుతూఉంటే వినాలి. అది వినయంయొక్క లక్షణం. మనం లోపల కల్మషంలేకుండా నిర్మలంగా, పవిత్రంగాఉండాలి. మనం మంచిగాజీవిస్తూ, ఇతరులుమంచిగా జీవించటానికి సహాయ సహకారాములు అందిస్తూఉంటే లోపలనుండి పవిత్రత ఆవిర్భవిస్తుంది, పవిత్రతలోనుండి శాంతివస్తుంది, శాంతిలోనుండి శక్తివస్తుంది. ఆ శక్తి మనం బాగుపడటానికి ఉపయోగపడుతుంది, ఆ శక్తిని సమాజంకోసంకూడా ఉపయోగించవచ్చు. శక్తిలేకపోతే మనం ఏమీచేయలేము. విష్ణుసహస్ర నామాలలో విశ్వంఅంటే పరమేశ్వరుడే ఈలోకం రూపంలోఉన్నాడు. భగవంతుడు మనలోపల ఉన్నాడు అని అనుకొంటున్నాము. కాని మనం అందరం భగవంతుడిలోనే ఉన్నాము. ఏదిజరిగినా ఆయనకు తెలియకుండా జరగదు. మనం తెగిపోయిన గాలిపటంలాగ లేము. ఈ సృష్టికి ఒక కంట్రోలర్ ఉన్నాడు. మనం ఇష్టంవచ్చినట్లు గంతులువేస్తే కుదరదు. నిన్ను ఎక్కడ కూర్చోబెట్టాలో, ఎక్కడనిలబెట్టాలో, ఏరోజుననీకు మరణంవస్తుందో, ఏరోజున ఇంట్లో గలాటావస్తుందో, నీవంటిమీద ఎన్ని సన్మానాలు ఉన్నాయో, ఎన్ని అవమానాలు ఉన్నయో ఇవి అన్నీ పద్ధతి ప్రకారం నీ దేహప్రారబ్ధం ననుసరించి ఈశ్వరుడు తీసుకొనివస్తాడు. ఈశ్వరుని ప్రణాళికలోఉంటే నీ తెలివితో, నీకోరికతో సంబంధంలేకుండా జరగవలసింది దానంతటఅదే జరిగిపోతుంది. భగవంతునిపట్ల ప్రవత్తి కలిగిఉండు. భక్తితో, ప్రేమతో, ఏకాగ్రతతో భగవంతుని పాదాలయందు మనస్సును నిలబెడితే అలజడి తగ్గిపోతుంది,

కోరికలురావు, తలంపులురావు. భగవంతునిపాదాలయందు భక్తికుదిరితే నీవు ఏవిషయాలనయితే జయించాలి అనుకొంటున్నావో అవి అన్నీ వాటంతటఅవే రాలిపోతాయి ఇతరులను ఎవరినీ ద్వేషించవద్దు. నీకు ద్వేషంవస్తూఉంటే, బ్రహ్మానుభవం పొందటానికి ఏ విషయాలయితే నీకు అడ్డువస్తున్నాయో వాటిని ద్వేషించు. ఆలోచన ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండాలి. ఆలోచన పాజిటివ్‌గాఉంటే ఉపయోగంలేని తలంపులురావు. భారంఅంతా ఈశ్వరునిమీద పెట్టండి. కర్తృత్వంవలన దుఃఖంవస్తోంది కాబట్టి కర్తృత్వం విడిచిపెట్టండి. భగవాన్ జీవితం పొడుగునా చెప్పింది ఏమిటిఅంటే ఈ రోజుపచ్చగాఉండి రేపు ఎండిపోయే తాత్కాలిక విషయాలగురించి ఆలోచించవద్దు, ఏదైతే శాశ్వతమో, ఏదైతే నిత్యమో దానినే మీగమ్యంగాపెట్టుకోండిఅనిచెప్పారు. ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. లౌకికుల మాటలను ప్రమాణంగా పెట్టుకోవద్దు. వాతావరణం ఎటువంటిదో లౌకికులుకూడా అటువంటివారే. వాతావరణం గంటగంటకు ఎలా మారుతూఉంటుందో లౌకికుల మనస్సులుకూడా అలా మారుతూఉంటాయి. ఈశ్వరుని వాక్యాన్ని ప్రమాణంగాపెట్టుకొని జీవిస్తే మనం తరిస్తాము.

భక్తిలో, ఏకాగ్రతలో ప్రహ్లాదుడిది అగ్రస్థానం. సముద్రంలోపడవేసినా, ఏనుగులతో తొక్కించినా, అగ్నిలోపడవేసినా నారాయణుడిపట్ల ఏకాగ్రత చలించలేదు. అటువంటి మినహాయింపులులేనిభక్తి, పరిపూర్ణమైన ఏకాగ్రత కలిగిఉండాలి. సమాజానికి సేవచేస్తున్నాముఅని మనం అనుకొంటాము, భగవంతుని ప్రేమిస్తున్నాముఅని మనం అనుకొంటాము. మనం చేసేసేవ నిజమైతే, మనకు ఉన్నభక్తి నిజమైతే ఆరోజుకు ఆరోజు వ్యక్తిభావన తగ్గుతూఉండాలి. వ్యక్తిభావన తగ్గలేదుఅనుకో ఆ ప్రేమ నిజంఅని నేను అనుకొంటానుఅని నీవు అనుకొంటున్నావా? ఇలా నన్ను మోసం చేయాలనుకొంటున్నావా? అని భగవంతుడు అడుగుతున్నాడు. నీవుచేసే పనులవలన వ్యక్తిభావన తగ్గకపోతే ఇవిఅన్నీ ఎందుకు? నీవు సమాజమును మోసంచేయగలవుగాని భగవంతుడిని మోసంచేయలేవు. నువ్వు ఏదైతేకాదో వాటిఅన్నింటిని ఇదికాదు, ఇదికాదు అనిగెంటుకొంటూవెళితే ఉన్నది ఉన్నట్లుగా నీకు తెలుస్తుంది. ఎవరినైనా అడిగేటప్పడు తెలుసుకోవాలనే బుద్ధితో అడగాలిగాని వాదించాలనే బుద్ధితో మాట్లాడకూడదు. అహంకారంతోటి, హేళనకోసం అడగకూడదు. దానివలన వ్యక్తిభావన పెరుగుతుంది, అజ్ఞానం పెరుగుతుంది, మనస్సు చిక్కబడుతుంది.

అందువలన వినయం విడిచిపెట్టవద్దు, నమ్రత విడిచిపెట్టవద్దు. సన్మానములకంటే అవమానములే మంచిది. సన్మానంవలన బాధ్యత పెరుగుతుంది. అవమానమును ఒకగంట ఓర్పుగాభరిస్తే ఆ బాధలోనుండి బయటపడతాము.

భగవంతుడు మన తెలివితేటల జోలికిరాడు. ఎవరికైతే భగవదనుభవం కలిగిందో వారి తెలివిని తనపనికి ఈశ్వరుడు ఉపయోగించుకొంటాడు. నిజమైనప్రేమ మన హృదయంలోనేఉంది. ఆ ప్రేమరహస్యం నీకుతెలిస్తే, భగవంతునిగురించి నీకుతెలిస్తే ప్రపంచాన్ని ప్రేమించకుండా ఎలా ఉండగలవు. అప్పుడు ప్రపంచాన్ని ప్రేమించాలిఅని ప్రేమించవు, ప్రేమించకుండా ఉండలేవుకాబట్టి ప్రేమిస్తావు. అది నిజమైన ప్రేమ. ఆ ప్రేమకు సంబంధించిన అనుభూతి నీకు కలిగితే మొత్తం అన్నిమతాలసారం, అన్నిమార్గాలసారం, అన్నిదేవతలరహస్యం నీకు తెలిసినట్లే. జ్ఞాని తననుచూసి అసూయపడేవారినికూడా ప్రేమిస్తాడు, కారణం జ్ఞానిస్వరూపంలో ప్రేమతప్పించి ఏమీలేదు. ఆ ప్రేమతత్వం అనుభవంలోనికి వస్తే ఎటుచూసినా ప్రేమేకనబడుతుంది. కల్మషంలేనివాడిని, ప్రశాంత మనస్సుఉన్నవాడిని, ఏకాగ్రతఉన్నవాడిని, బ్రహ్మభావనఉన్నవాడిని ఉత్తమమైన సుఖంవచ్చి వరిస్తుంది. ఎంతకాలం చేస్తారు ఈ యోగాభ్యాసాలు. ఈశ్వరునిపాదాలయందు భక్తికలిగిఉండు. ఈశ్వరునిపాదాలయందు భక్తిలేదుఅనుకో ఈ చప్పిడికూరలు రక్షిస్తాయి అనుకోవద్దు. దానివలన దేహానికి ఆరోగ్యంరావచ్చు అంతమాత్రంచేత ఏదోవచ్చేస్తుంది అని అనుకోవద్దు. నీకు ప్రేమస్వరూపం తెలిసిందిఅనుకో చావుపుట్టుకలుఅనే చిక్కుముడి విడిపోతుంది. అప్పుడు ప్రేమశిఖరాలను అధిరోహించవచ్చు. ఈశ్వరునిపాదాలయందు భక్తికుదిరితే, ఏకాగ్రతకుదిరితే నది ఆదిలో మేకలు ఎంతతేలికగా నదినిదాటతాయో అంతతేలికగా నీవు మాయను జయించి ముక్తిని పొందుతావు. భగవంతునిపట్ల ప్రేమ, భక్తి పెరిగితే ఈశ్వరసాక్షాత్కారంవద్దు, వద్దుఅన్నా వచ్చి నిన్ను వరిస్తుంది.

# జీవితానుభవంతో ఈశ్వరానుభవం పొందటమే జీవితపరమార్థం

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 19-8-2001, ఆకివీడు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏపనిచేసినా యజ్ఞభావంతో చేయాలి. యజ్ఞభావంతో జీవిస్తూఉంటే ఆరోజుకు ఆరోజు మన చైతన్యస్థాయి పెరిగి, పునర్జన్మలేనిస్థితికి చేరుకొంటాము. స్వార్థంలేకుండా ఇతరులకు ఒకమంచిమాటచెప్పినా అదికూడా యజ్ఞంతో సమానము. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సమాజంతో పంచుకోవటం యజ్ఞం. మనకు ఉన్నదానిని ఇతరులతో పంచుకోవటంవలన ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము, మన చైతన్యస్థాయి పెరుగుతుంది. భగవంతుడు ఒకోమనిషికి ఒకోనేర్పును ఇస్తాడు. ఆ నేర్పును ఓర్పుఉన్నవాడు బాగా ఉపయోగించుకొంటాడు. నేర్పుఉన్నవాడికి ఓర్పుకూడాఉంటే ఆనేర్పు వాడికి, వాడికుటుంబానికి, సమాజానికికూడా ఎంతో ఉపయోగపడుతుంది. మోక్షమార్గానికి దారిచూపించని తల్లి తల్లేకాదు, మోక్షమార్గానికి దారిచూపించనితండ్రి తండ్రేకాదు, మోక్షమార్గానికి దారిచూపించని గురువు గురువేకాదు, మోక్షమార్గానికి దారిచూపించని భగవంతుడు అసలు భగవంతుడేకాదు అని పెద్దలుచెపుతారు. మీదేహప్రారబ్దమునుబట్టి మీకు ధనం, విద్య, తెలివి ఉండవచ్చు. మీదేహప్రారబ్దంలోఉంటే మీకోరికతో సంబంధంలేకుండా అవి వచ్చితీరుతాయి. అయితే వాటితో తాదాప్యంచెందితే మీరు లోపలకు వెళ్ళలేరు. దేహప్రారబ్దంనుబట్టి ఎన్నోరావచ్చు కాని వాటితో తాదాప్యం వలన హృదయంలోఉన్న చైతన్యం తాలుక స్పందన మనకు తెలియటంలేదు. మనకు దేహాభిమానం ఉన్నంతకాలం ప్రతీజన్మలోను ఏదోరకమైన భయం మనలను వెంటాడుతూఉంటుంది. అన్నిభయాలలోనికి మరణభయం పెద్దది. కాని జ్ఞానికి మరణభయంకూడా ఉండదు. ఎందుచేతనంటే శరీరానికి మరణం రాకముందే మరణాన్ని మింగేసి అభయస్థితిని పొందిఉంటాడు.

పొట్టకోసం మనం అనేక విద్యలు నేర్చుకొంటాము, అనేక పనులుచేస్తూఉంటాము. గౌరవంకోసం కొన్ని పనులుచేస్తాము. ఇలా నీవుచేసేవి అన్నీ పనులు అనినీవు అనుకొంటున్నావు. ఇవి అన్నీ పనులుకాదు. ఇన్నిరకాల పనులు ఏమీలేవు, పనిఅంటే ఒక్కటేపని, జాగ్రదవస్థలో

దేహాభిమానంలోనుండి, దొంగనేనులోనుండి విడుదలపొందటానికి నీవుచేసే ప్రయత్నమే నిజమైన పని మిగతావి అన్నీ పనులుకాదు, పనులక్రింద నీకు కనిపిస్తున్నాయి, ఇవిఅన్నీ ఒకటిలేని సున్నలతో సమానము. పైకి ఎగరటంతేలిక, లోపలకు దిగటం చాలాకష్టం. ఎంతసాధనచేసిన ఒకోసారి ఒక్కఅంగుళంకూడా లోపలకు దిగలేము, దానికి ఎంతో తూకంఉండాలి, సమస్థితిఉండాలి, సమగ్రదృష్టిఉండాలి, ప్రతీవిషయంలోను మధ్యేమార్గం అవలంభించాలి, సమాజంలో ఎంతవరకూఉండాలో అంతవరకేఉండాలి, వీటిఅన్నింటికిమించి గురువుఅనుగ్రహంఉంటేగాని హృదయంలోని భగవంతుడిదగ్గరకు చేరుకోలేము. అన్ని సాధనలు మనంచేయలేము. చేయగలిగినది నెమ్మదిగా ప్రాక్టీసుచేయాలి. శ్రద్ధగా, నిదానంగా ప్రయత్నంచేస్తూఉంటే మనకు తెలియకుండా వస్తువు అనుభవంలోనికి వచ్చేస్తుంది. కంగారుపడవద్దు. మనంలోపల పవిత్రులం అవుతూరావాలి, ఏకాగ్రత పెంచుకొంటూరావాలి, ఏకారణాలవలన మనస్సు బాహ్యాముఖానికి వెళుతోందో ఆ కారణాలను కత్తిరించుకొంటూరావాలి. మనం పవిత్రులం అయ్యేవరకు సమాజమును ఉపయోగించుకోవాలి. అంతకంటే ఎక్కువగా సమాజంతోఉంటే అహంకారం పెరిగిపోతుంది.

మీరు విచారణమార్గం గురించి, శరణాగతిమార్గంగురించి రెండుమార్గాలు చెపుతున్నారుఅని భగవాన్‌ను అడిగితే నీ సందేహం అదా ఈరెండు మార్గాలు ఒకదానికి ఒకటి సహకరిస్తాయి. శరణాగతి చెందటానికి దేహం అడ్డురావటంలేదు, ఆదేహంతో తాదాప్యంపొందే నేనుఅడ్డువస్తోంది. విచారణచేసి ఆ నేనును తీసేస్తే పూర్ణశరణాగతి కుదురుతుంది. ఇందులో పరస్పర విరుద్దం ఏమీలేదు. నీ మనస్సుకు అలా అనిపిస్తోంది. ఇవి పరస్పరం సహకరించుకొంటాయిఅని భగవాన్ చెప్పారు. నిన్ను నీవు తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం ఎన్నో విద్యలు నేర్చుకొంటున్నారు. జననమరణప్రవాహంలో నుండి విడుదల పొందాలంటే నీవు ఎవరో నువ్వు తెలుసుకోవటంనేర్చుకో. మేము చాలాబిజీగాఉన్నాము, మాకుటైములేదు అంటారు. నీవు సోమరితనానికి అలవాటుపడ్డావు. పొట్టపోషించుకోవటానికి టైముపోగా ఇంకాచాలాటైము మిగులుతుంది, ఆ టైము వృధాచేసుకొంటున్నావు. ఆ టైములో నీవు ఎవరో నీవు తెలుసుకోవటం నేర్చుకొంటే నీకు జ్ఞానం కలుగుతుంది, జనన మరణప్రవాహంనుండి విడుదలపొందుతావు. దుమ్ముఅంతా మనస్సులోనేఉంది.

బట్టలమీదఉన్న దుమ్మును దులిపినట్లు మనస్సులోఉన్న దుమ్మును దులపటానికే యోగం. లోపలఉన్న బ్రహ్మం ఎంత నిర్మలంగాఉందో, ఎంతపవిత్రంగాఉందో, ఎంతనిశ్చలంగాఉందో అటువంటిస్థితి నీ మనస్సుకు వచ్చినప్పుడు పాలు పాలలో, నీరు నీరులో కల్సిపోయినట్లుగా నీ మనస్సు బ్రహ్మంలో కలిసిపోయి తదాకారం చెందుతుంది. సాధనఅంటే ఏమీలేదు మర్చిపోవలసిన విషయాలుఅన్నీ మర్చిపోవాలి, భగవంతుడు చెప్పిన విషయాలు గుర్తుపెట్టుకోవాలి. అలా ఉంటే సాధన ప్రారంభమవుతున్నట్లు గుర్తు. అన్నింటికంటే హీనమైనది అహంకారం. కాని మనం దానిని బంగారం అనుకొని నెత్తిమీద పెట్టుకొని తిరుగుతున్నాము. మనం వ్యక్తిభావనను తగ్గించుకొంటూరావాలి. వ్యక్తిభావన ఎంతవరకుతగ్గితే ఆమనిషికి అంతవరకు సమాజంపట్ల దయకలుగుతుంది. దయలేకుండా ప్రేమరాదు. నా తెలివి మీకు ఉపయోగపడదు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను అనుకోండి ఆ ప్రేమలోనుండి తెలివిపుడుతుంది. ఆ తెలివి సమాజానికి ఉపయోగపడుతుంది.

జీవితంఅంతా తలంపులే. ఈ తలంపులు ఏమీనిజంకాదు. తలంపులు పెంచుకొంటే బంధింపబడతావు. తలంపులు తగ్గించుకొంటే భ్రాంతిలోనుండి విడుదల పొందుతావు. నిరంతరం విషయచింతనలోఉన్నవాడికి భ్రాంతిమిగులుతుంది, ఆత్మను తెలుసుకోవాలనే తలంపుకూడా వాడికిరాదు. ఆత్మచింతన చేసేవాడు భ్రాంతిలోనుండి, అజ్ఞానంలోనుండి విడుదల పొందుతాడు. మంచిపనులుచేసేవాడు మాత్రమే మంచివాడు అనుకోవద్దు. సహజంగా మంచిగా జీవిస్తూ మంచిపనులుచేసేవాడు ఉత్తమోత్తముడు. మంచివారితో స్నేహంచేస్తే మంచితలంపులువస్తూఉంటాయి, చెడ్డవారితో స్నేహంచేస్తే చెడుతలంపులు వస్తూఉంటాయి, ఇలా తలంపులు మారుతూఉంటాయి. కాని దేహంనేనుఅనే తలంపు మాత్రం ప్రతీజన్మలోనూ కంటిన్యూఅవుతుంది. ఆ నేనుఅనే తలంపునుండి విడుదల పొందకపోతే మీకుఆనందంలేదు, స్వేచ్ఛలేదు, మోక్షంలేదు. దేహంఉన్నంతసేపు రోగం వచ్చేఅవకాశంఉంది. ఈరోజు రోగంవస్తే డాక్టరుదగ్గరకువెళ్ళి మందులువాడి ఆరోగాన్ని తగ్గించుకొన్నా మరల ఇంకోరోగంరాదు అనిచెప్పలేము. దేహం ఉన్నంతసేపు రోగంవచ్చే అవకాశంఉంది అలాగే దేహమునేనుఅనే తలంపు ఉన్నంతకాలం అనేకతలంపులు అవి మంచితలంపులు అవ్వవచ్చు, చెడుతలంపులు అవ్వవచ్చు ఏదోరకమైన తలంపులువచ్చే ప్రమాదంఉంది. అందువలన అజాగ్రత్త

పనికిరాదు. నీసాధనలో మూలతలంపును ఇమడ్చాలి లేకపోతే అదినశించదు. నీ సాధనఅంతా దేహమునేనుఅనే మూలతలంపుమీద గురిపెట్టకపోతే ఈలోపుగా నీవుచేసే పనులవలస పుణ్యంరావచ్చు, గౌరవాలురావచ్చు, దేవుడు వరాలుఇవ్వవచ్చు కాని జ్ఞానం సున్నా. రోడ్డుమీద ప్రయాణంచేసేటప్పడు జంక్షన్‌లువస్తూఉంటాయి. అప్పడు అడిగి తెలుసుకొని సరియైన మార్గంలోవెళితే గమ్యానికి చేరతాము. తప్పడుమార్గంలోవెళితే గమ్యాన్ని మిస్‌అవుతాము, మరల వెనుకకు రావటానికి ఎంతటైము పడుతుందో చెప్పలేము. జీవితంలో అనేక మలుపులువస్తూఉంటాయి. గురువు సహాయంతీసుకొని సరియైన మార్గంలో వెళితే నెమ్మదిగావెళ్ళినా గమ్యం చేరతాము.

గాఢనిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి రాగానే ఈ దేహమునేనుఅని ఏతలంపుఅయితే చెపుతోందో దానిని గట్టిగా పట్టుకో. దానిని నీవు ఎవరు అని విచారణచేస్తే అది నెమ్మదిగాలోపలకు సర్దుకొంటుంది అప్పడు మిగతాతలంపులు వాటిఅంతటఅవే రాలిపోతాయి. మిగతా తలంపులను మార్చుకొన్నంతమాత్రంచేత మూలతలంపు నశించదు మూలతలంపును విచారణచేయాలి. సాధనపేరుమీద నీవుకొట్టే దెబ్బలుఅన్నీ మూలతలంపుమీదపడాలి. మీరు మూలతలంపు మూలంలోనికి వెళ్ళాలి. మూలతలంపుమూలంలోనే ఈశ్వరుడుఉన్నాడు. నీ సాధనవలన మూతలంపు మూలంలోనికి వెళ్ళలేవు, ఈశ్వరశక్తివచ్చి నిన్ను బలీయంగా లోపలకుగెంటాలి. దానికోసం మీరుచేసే ప్రయత్నం చిన్నదిఅయినా ప్రేమతో, చిత్తశుద్ధితో శ్రద్ధగాచేయండి. మీరుచేసేపని పెద్దదా, చిన్నదాఅని భగవంతుడు చూడడు. ఏభావంతో చేస్తున్నారో భగవంతుడు చూస్తాడు, అక్కడ చిత్తశుద్ధిఉంటే ఆయన అనుగ్రహిస్తాడు. ఇంట్లో వస్తువులనుకూడా మనం నిర్లక్ష్యంగా చూడకూడదు. అందులోకూడా దేవుడు ఉన్నాడు. వాటిని నిర్లక్ష్యంచేస్తే అవి భగవంతుడికి చెపుతాయి, వచ్చేజన్మకు మనకు అవికూడాలేకుండాచేస్తాడు. అనేక తలంపులువచ్చేస్తున్నాయి, అవిలేకుండా ఉండలేకపోతున్నాను. వాటిని తొలగించలేకపోతున్నాను అని అడుగుతున్నాడు. తలంపులను నెట్టమని నేను చెప్పటంలేదు ఎన్ని తలంపులను అలాబయటకు గెంటగలవు. చెప్పేది అర్ధంచేసుకోండి, మూలతలంపును పట్టుకొని ఉండండి. అప్పడు ఇతరతలంపులువచ్చినా

వెళ్ళిపోతాయి. మీపనిలోమీరు బిజీగాఉండండి. ఎవరైనావచ్చినా వెళ్ళిపోతారు. అలాగే మూలతలంపును పట్టుకొనిఉంటే ఇతర తలంపులు వస్తాయి, వెళ్ళిపోతాయి, వాటితో విరోధంపెట్టుకోనక్కరలేదు. మూలతలంపుమీద ఏకాగ్రత పెట్టుకో. అప్పుడు మిగతాతలంపులను పట్టించుకొనేవాడు ఉండడు, అప్పుడు వాటి అంతట అవేరాలిపోతాయి. మీరు ఏ యోగంలో ప్రయాణంచేసినా లోపలకువెళుతున్నారా, లేదా అనేది చూసుకోండి. మూలతలంపు దానిమూలంలోనికి వెళుతూఉంటే మిగతాతలంపులకు ఆశ్రయంలేక అవిఅన్నీ బయటకుపోతాయి. మూలతలంపు మూలంలోనికి వెళ్ళేకొలది రెండుపనులు జరిగిపోతాయి. వాసనలుఅన్నీపోతాయి, అది చైతన్యంలో కలిసిపోతుంది, మూలతలంపు మూలం తెలుసుకోవటానికి నీవు సరదాగా ప్రయత్నంచెయ్యకు. నీవుచేసే ప్రయత్నం నిండుమనస్సుతో, ఏకాగ్రంగా, పవిత్రతతో, చిత్తశుద్ధితోచెయ్యి. మూలతలంపు మూలంలోనికి వెళ్ళాక మూలతలంపు నిజంకాదని, దానికోసం నీవుచేసే ప్రయత్నం నిజంకాదని నీకు తెలుస్తుంది. తలంపుల వేగాన్ని పోగొట్టి హృదయంలో స్థిరపడటం సాధ్యమా అని సందేహంవద్దు. నీ హృదయంలో బ్రహ్మం ఎంతలోతులలోఉందో అక్కడకు చేరేవరకు సందేహంలేకుండా, విరామంలేకుండా ప్రయత్నంచెయ్యి, విచారణ విడిచిపెట్టవద్దు. మూలతలంపును దానిమూలంలోనికి పంపేవరకూ నీవుఎవడుఅని దానిని ప్రశ్నిస్తూఉండు. దానిమూలంలోనికివెళితే అది నశిస్తుంది. అప్పుడు నీవు ఎవరో నీకు తెలుస్తుంది. నీవుఎవరో నీకుతెలియటమే ఆత్మజ్ఞానం. మతాన్ని పట్టుకొని వేలాడవద్దు. మతం ఏవస్తువును పొందమని చెపుతోందో దానిని పొందాలి. జీవించటమే ప్రధానంకాదు. జీవితంద్వారా అనుభవంపొంది హృదయంలోఉన్న ఈశ్వరుడిని అందుకోవటమే జీవితపరమార్థం.